క్లుప్తంగా

హిందీ భాషాభివృద్ధికి కృషి



హిందీ ప్రచారసభ డైరీలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: జాతీయ భాష హిందీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో హిందీ ప్రచారసభ డైరీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 1939లో స్థాపించిన హిందీ ప్రచార సభలో మన భారత ప్రధానమంత్రులు కూడా చదువుకున్నారని గుర్తుచేశారు. ప్రాథమిక స్థాయి నుంచే హిందీ మాట్లాడేలా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావాలని హిందీ ప్రచార సభ కార్యదర్శి పెద్ద హాజీవలికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డి.బాబయ్య, ఏపీ హిందీ ప్రచార సభ తాడిపత్రి కన్వీనర్ రామచంద్ర, హిందీ ఉపాధ్యాయులు మస్తాన్‌వలి, ఆయేషా, పర్వీన్, గౌసు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

యల్లనూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దారు జయప్రసాద్ ఆదివారం తెలిపారు. సమస్యలున్నవారు అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

అందరినీ కాపాడేవాడు 'దేవుడు'



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: సర్వమానవుల పట్ల పక్షపాతం లేకుండా అందరినీ కాపాడేవాడు దేవుడు ఒక్కడే అని పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ అన్నారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధనోత్సవ కార్యక్రమంలో ఆయన క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. సమస్తాన్ని స్వస్థపరచే సర్వశక్తిమంతుడు ఏసు అన్నారు. దేవుని సువర్తమానము ప్రకటిస్తూ రోగులను స్వస్థపరుస్తూ అనేక అద్భుతకార్యాలు చేసిన ఆశ్చర్యకరుడు, ఆలోచన కర్త ఏసుక్రీస్తు అన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు వీరయ్య, జయరాజు, అబ్రహాం, దేవదాసు, కరుణాకర్, దావీదు, ప్రసాద్, రజని, సుశీలమ్మ, మాణిక్యమ్మ, రేచెల్, మహిమ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ, చౌడేశ్వరి విగ్రహ ప్రతిష్ట



చెర్లోపల్లిలో పెద్దమ్మ అమ్మవారు

పుట్లూరు: మండలంలోని చెర్లోపల్లి, నారాయణరెడ్డిపల్లి గ్రామాల్లో ఆదివారం పెద్దమ్మ, చౌడేశ్వరీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చెర్లోపల్లిలో పెద్దమ్మ అమ్మవారి విగ్రహం, నారాయణరెడ్డిపల్లిలో, చౌడేశ్వరీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మామిడితోటలో అగ్ని ప్రమాదం



అగ్నికి ఆహుతైన మామిడి చెట్లు

పెద్దవడుగూరు: మండలంలోని గోపురాజుపల్లిలో రైతులు సంజీవయ్య, చంద్రకు చెందిన 300 మామిడి చెట్లు అగ్నికి ఆహుతైన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రైతులు శనివారం తాడిపత్రికి పోయి సాయంత్రం గ్రామానికి చేరుకున్నారు. రాత్రి పొలం వద్దకు వెళ్లగా మంటలో చెట్లు కాలుతూ కనిపించాయి. దీంతో మంటలను ఆర్పడానికి ప్రయత్నం చేశారు. అప్పటికే చెట్లు కింద భాగం తోట మొత్తం కాలిపోయింది. మూడేళ్లుగా కంటి రెప్పలా కాపాడుకొంటున్న చెట్లు కాలిపోవడంతో ఆవేదనకు లోనయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉండవచ్చని బాధితులు చెబుతున్నారు. ఎవ్వరితోనూ విభేదాలు లేవన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అధికారులు ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.



దారులన్నీ సిద్ధం సభ వైపు..

- రాప్తాడుకు తరలిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు
- సభ సక్సెస్‌తో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్

హామీలన్నీ నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి జనం జేజేలు కొట్టారు. ఆదివారం రాప్తాడు వద్ద జరిగిన 'సిద్ధం' సభకు తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, పథకాల లబ్ధిదారులు స్వచ్ఛందంగా తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సమకూర్చిన ప్రత్యేక వాహనాలే కాకుండా సొంత వాహనాల్లోనూ ఉత్సాహంతో కదిలారు. సంక్షేమ పథకాలను కొనసాగించుకునేందుకు తామంతా సిద్ధమంటూ సీఎంకు జయ జయ ధ్వానాలు పలికారు. జై జగన్, జైజై జగన్, వైఎస్సార్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా, ఉల్లాసంగా సిద్ధం సభకు తరలివెళ్లారు.

గుత్తి: గుత్తి, గుత్తి రూరల్ ప్రాంతాల నుంచి రాప్తాడు సీఎం వైఎస్ జగన్ సిద్ధం బహిరంగ సభకు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆదివారం భారీగా తరలివెళ్లారు. గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి నేతృత్వంలో సుమారు 80 వాహనాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. బస్సులు, జీపులు, కార్లు ఇతరత్రా వాహనాల్లో పార్టీ నాయకులు, అభిమానులు తరలివెళ్లారు.

శింగనమల: రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభకు నియోజకవర్గం నుంచి దాదాపు 250 బస్సుల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లాయి. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఎంపీపీ యోగేశ్వరి, జెడ్పీటీసీ కంచిరెడ్డి సుధ, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి తదితర నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు.

పామిడి: రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు జనం కదలిలా కదిలారు. గుంతకల్ ఎమ్మెల్యే వై వీఆర్ ఆదేశాల మేరకు పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణ రెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, రూరల్ సచివాలయాల కన్వీనర్ ఎం.కుమార్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు వంద వాహనాల్లో 6,000 మందికిపైగా సభకు వెళ్ళారు. పార్టీ నాయకులు, బోయ రామచంద్ర, అనుంపల్లి సూరి, రమణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, దాసరి కిష్ట, బషీర్, ప్రసాద్, బయపరెడ్డి, దామోదర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో సిద్ధం అంటూ నినదిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

పుట్లూరు: మండలవ్యాప్తంగా ఆదివారం రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివెళ్లారు. సభకు వెళ్లే బస్సులను శింగనమల మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీతమ్మ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు.

యల్లనూరు: రాప్తాడు వద్ద సిద్ధం సభకు శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మెన్ భోగతి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంనాయుడు, సచివాలయాల మండల కన్వీనరు ప్రభాకర్‌రెడ్డి, తిరుమలాపురం సర్పంచు రామాంజులరెడ్డి, వేములపల్లి సర్పంచు అశోక్‌కుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సభకు తరలివెళ్లారు.

బుక్కరాయసముద్రం: రాప్తాడులో సిద్ధం మహాసభకు బీకేఎస్ మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజా ప్రతినిధులు పెద్దఎత్తున తరలివెళ్లారు. వాహనాలను జెడ్పీటీసీ భాస్కర్ పర్యవేక్షించారు.

గార్లదిన్నె: రాప్తాడులో సిద్ధం సభకు ఆదివారం మండలంలో పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లారు. ఈసందర్భంగా మండల నాయకులు వారికి అన్ని ఏర్పాట్లు చేశారు.

యాడికి: మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఉదయం 58 బస్సుల్లో రాప్తాడులో వైఎస్సార్‌సీపీ సిద్ధం సభకు తలివెళ్లారు. పార్టీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండలవ్యాప్తంగా 4 వేల మంది తరిలారు.

తాడిపత్రిటౌన్: రాప్తాడు వద్ద సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిద్ధం సభకు తాడిపత్రి నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు వేలాదిగా తరలివెళ్లారు. దాదాపు 250 బస్సుల్లో ఆయా గ్రామాల నుంచి తరిలారు.

పెద్దవడుగూరు: రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభకు మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లాయి. సుమారు 50 బస్సులు, 30 కార్లు, వందకు పైగా బైకుల్లో నాయకులు, కార్యకర్తలు రాప్తాడుకు తరలివెళ్లారు.

పెత్తందారులతో యుద్ధానికి 'సిద్ధం'

గుంతకల్లుటౌన్: సార్వత్రిక పోరులో పెత్తందారులు, దుష్ట చతుష్టయంతో యుద్ధానికి వైఎస్సార్‌సీపీ సైనికులంతా సంసిద్ధంగా ఉన్నారని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. రాప్తాడులో జరిగిన వైఎస్సార్‌సీపీ సిద్ధం సభకు గుంతకల్లు నియోజకవర్గం నుంచి 280 బస్సులు ప్రైవేట్ వాహనాలు, లారీల్లో వేలాది మంది పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175కి 175 స్థానాలు సాధించడం, మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులే వైఎస్సార్‌సీపీ స్టార్ క్యాంపెయినర్లన్నారు. ప్రజలంతా 'వన్స్‌మోర్ జగన్' అని నినదిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు రామలింగప్ప, రామాంజనేయులు, నాయకులు ఎద్దుల శంకర్, రాజశేఖర్, దేవేంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రి నుంచి సిద్ధం సభకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పెద్దవడుగూరు నుంచి..



శింగనమల నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు



గుత్తి నుంచి సిద్ధం సభకు తరలివెళుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



పామిడి నుంచి బస్సులో వెళ్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



పుట్లూరు నుంచి బయలుదేరిన వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు



యల్లనూరు మండలం తిరుమలాపురం నుంచి బస్సులో తరలివెళ్తున్న కార్యకర్తలు



బుక్కరాయసముద్రం నుంచి సభకు తరలివెళ్తున్న నాయకులు



గార్లదిన్నె: యర్రగుంట్లలో సిద్ధం సభకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



యాడికి నుంచి సిద్ధం సభకు తరలుతున్న ప్రజలు

నారాయణ స్వామీ..నమోస్తుతే..



అలంకరణలో శింగరబట్లు, గణపతి, నారాయణస్వామి



స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు

పెద్దపప్పూరు: మాఘమాసం రెండో ఆదివారం అశ్వత్థం తిరుణాల సందర్భంగా ఆదివారం ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ నుంచి నారాయణ స్వామిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఓం నమో నారాయణాయ అంటూ స్వామి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు ముడుపులు, కానుకలతో పాటు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మొక్కుబడిలో భాగంగా దర్మవరం పట్టణానికి చెందిన యల్లప్ప బ్రదర్స్‌తో పాటు పలువురు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నది లోతట్టు ప్రాంతాల్లోకి దివ్యాంగులు, చిన్నారులు, వృద్ధులు వెళ్లకుండా పెద్దవడుగూరు సీఐ రోషన్, ఎస్ఐ ఆంజనేయులు పర్యవేక్షించారు. భక్తులు అసౌకర్యాలకు గురికాకుండా ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యం సౌకర్యాలు కల్పించారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

'బొలికొండ' బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడులో బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మాఘ శుద్ధ నవమి ఆదివారం రాత్రి స్వామిని పెళ్లికుమారుడిగా ముస్తాబు చేసి జక్కలచెరువు గ్రామం నుంచి తొండపాడు గ్రామానికి పల్లకి సేవలో ఊరేగింపుగా తీసుకొచ్చి కొలువు తీర్చారు. ఈ సందర్భంగా జక్కలచెరువు గ్రామంలో రంగనాథ స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళ హారతి నిర్వహించారు. మధ్యాహ్నం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ దేవదాసు, జెడ్పీటీసీ సభ్యురాలు రాధిక, జెడ్పీ మాజీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్‌యాదవ్, సర్పంచ్ రుక్మిణి, అర్చకులు పలుకూరు రవికుమార్, నవీన్ కుమార్, లిఖిల్, ఉదయ్ కుమార్, చేతన్, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలు మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



అలంకరణలో రంగనాథుడు

కొండమీద రాయుడికి ప్రత్యేక పూజలు



పుష్ప పల్లకీలో ఊరేగుతున్న కొండమీదరాయుడు

బుక్కరాయసముద్రం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని సిద్దరాంపురం రోడ్డు సమీపాన వెలసిన దేవరకొండపై కొండమీద రాయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా వేద మంత్రాలతో హోమాలు నిర్వహించారు.

పుష్ప పల్లకీలో కొండమీద రాయుడి ఊరేగింపు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 8 గంటలకు కొండమీద రాయుడు విగ్రహాన్ని పుష్ప పల్లకిలో ఊరేగించారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు పుష్ప పల్లకీలో కొండమీదరాయుడు భక్తులకు కనువిందులు చేస్తూ దర్శనమిచ్చారు. మహిళలు శ్రీవారికి మంగళ హారతులు పట్టారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సోమవారం రాత్రి శ్రీవారు సింహ వాహనంపై ఊరేగనున్నారు. భక్తులు హాజరు కావాలని కమిటీ సభ్యులు కోరారు.



అలంకరణలో కొండమీదరాయుడు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

'పాలిటెక్నిక్'కు దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లుటౌన్: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ, శిక్షణ మండలి ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 27న నిర్వహించనున్న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గుంతకల్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పాలిసెట్ కోఆర్డినేటర్ అష్రఫ్ అలీ, ప్రిన్సిపాల్ వీరాస్వామి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 5లోగా పదో తరగతి పాసైన, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నేడు వలంటీర్లకు సన్మానం

శింగనమల: మండలంలోని వలంటీర్లకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీవీ రమణ ఆదివారం తెలిపారు. స్థానిక వాసవీ కల్యాణమండపంలో మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వలంటీర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు శోభాయాత్ర

పామిడి: పట్టణంలో భావసార సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని సమాజ్ కమిటీ ఆదివారం కోరింది. ఉదయం 9 గంటలకు స్థానిక పెద్ద విఠోబ ఆలయం నుంచి శివాజీ చిత్రపటంతో పురవీధుల్లో శోభాయాత్ర ర్యాలీ ఉంటుందన్నారు. భావసార క్షత్రియులు తరలి రావాలని కమిటీ సభ్యులు కోరారు.

ఆటోలు ఢీ- ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో ఆదివారం రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న పాత కొత్త చెరువుకు చెందిన రామకృష్ణ గాయపడ్డాడు. స్థానికులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కళింగర సాగుతో అధిక దిగుబడులు

గార్లదిన్నె: మండలంలో పుచ్చకాయ(కళింగర) సాగు మంచి లాభాలు తెచ్చిపెడుతుంది. వ్యాపారుల తోట వద్దకే వచ్చి కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మండల వ్యాప్తంగా 25 ఎకరాల్లో పుచ్చకాయ పంట సాగవుతుండగా, ఎకరాకు రూ.2 లక్షలు ఆదాయం వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. పుచ్చకాయ పంట సాగు చేస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు. రైతులు పంట మార్పిడి చేస్తూ కళింగర పంట సాగు లాభదాయకంగా ఉండడంతో ప్రతి ఏడాది సాగు విస్తీర్ణం పెరుగుతున్నది. మండలంలోని రైతు అమర్‌నాథ్‌రెడ్డి రెండు ఎకరాల్లో సాగు చేశాడు. ఎకరాకు దాదాపు రూ.75 వేల దాకా పెట్టుబడి పెట్టాడు. గత బుధవారం మొదటి పంట కోత కోయగా ఎకరాకు 18 టన్నుల దిగుబడి చొప్పున రెండు ఎకరాల్లో 36 టన్నులు దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో టన్ను ధర రూ.14 వేలు ఉండడంతో రూ.5,04,000 ఆదాయం వచ్చింది. పుచ్చకాయ పంట సాగులో అధిక దిగుబడులు రావడంతో కంపెనీ ప్రతి నిధులు సెల్స్ ఆఫీసర్ ప్రతాప్ రెడ్డి గ్రామానికి వచ్చి రైతును అభినందించారు.





గుడ్డాలపల్లిలో అమర్‌నాథ్‌రెడ్డి సాగు చేసిన పుచ్చకాయ పంట

జాగ్రత్తలు తీసుకోవాలి



కళింగర పంట తీగ జాతి పంట, నాటిన రెండున్నర నెలల్లోనే పంట వస్తుంది. రైతుల శ్రమపైనే దిగుబడి ఆధారపడి ఉంటుంది. తక్కువ సమయంలో పంట చేతికి రావాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పంట స్వల్పకాలంగా ఉండడంతో రైతులు ఆసక్తి చూపున్నారన్నారు. – సోమశేఖర్, మండల వ్యవసాయ అధికారి